# రొద

రచన :
బులుసు-జీ-ప్రకాష్

ప్లాట్ ఫారం మీదికి ఆయన చేరేసరికి రైలు కదిలింది.

గబగబా ఏ కంపార్టుమెంటు దొరికితే ఆ కంపార్టు మెంటులోకి ఎక్కిపోయాడు. కూలీవాడు, అతని పెట్టె బెడ్డింగు కంపార్టుమెంటులోనికి విసిరేశాడు. ఆయన కూడా కూలీవాని డబ్బులు ప్లాట్ ఫారం మీదికి విసిరే శాడు.

ఇంతకీ ఆ థర్డుక్లాసు కంపార్టుమెంటు ఆయనకు నచ్చి నట్లు కనబడదు. మూడవ తరగతి ప్రజల ఉమ్ములు, మాసిన గుడ్డలు చూసి-'రెచ్చెడ్ ! న్యూసెన్సు !' అని చీదరించుకున్నాడు.

అతనికి కూర్చునేందుకు జాగాలేదు. ఎదుటి సీట్లో కూర్చున్న నేను జాలిపడి, బహుశః దొరలకి మల్లే టిప్ టాప్‌గా ఉన్నాడనేమో, కొంచెం సర్దుకుని చోటిచ్చి-'రండి, దయచేయండి' అని స్వాగతం చెప్పాను. ఆయన వచ్చి కూర్చుని 'థాంక్సు' అన్నాడు.

అయినా నేనిచ్చిన స్థలంతో ఆయన సంతృప్తి చెంది నట్లు కనబడదు. దానిక్కారణం, ఆయనకు నేనిచ్చిన స్థలం, ఆయన రెండు జఘనాలూ పట్టేటంతటిది కాదనేమో ?

"ఛీఛీ మైఫేట్-నా ఖర్మమండీ! ఫస్టుక్లాసు టిక్కెట్ తీసుకుని థర్డుక్లాసులో కూర్చోడం!'' అని నొసటిమీద చెయ్యిపెట్టి కొట్టుకున్నాడు.

''మీరు ఫస్టుక్లాసు టిక్కెట్ తీసుకున్నారా?'' కొద్ది ఆశ్చర్యం పడ్డాను నేను.

"ష్యూర్ ! నేనొచ్చేసరికి పెధవ ట్రెయిను ప్లాట్ ఫారం కదిలిపోయిందిగా !''

''పోనీ వచ్చే స్టేషన్‌లో దిగిపోయి మీ ఫస్టుక్లాసు లోకి మీరు వెళిపోవచ్చులెండి !'' అన్నాను.

"నా దొక్క ఫస్టుక్లాసే కాదు. ఎయిర్ కండిషండ్ కంపార్టుమెంటు కూడాను. ఇదిగో టిక్కెట్ చూడండి!'' అని టిక్కెట్ చూపాడు. నిజమే, పాపం ఎయిర్ కండి షండ్ కంపార్టుమెంటే.

"ఈ ఎయిర్ కండిషనింగ్ సిస్టము ఏ ఇంగ్లీషు మహానుభావుడు కనిపెట్టాడో కాని వాడికి సేల్యూట్ కొట్టాలి. తస్సాదియ్యా! హీట్‌లో కూల్, కూల్‌లో హీట్-ఏ ఎట్మాస్ఫియర్‌కి తగినట్టుగా ఆ ఎట్మాస్ఫియర్ లో పని చేస్తుంది,'' అన్నాడతను.

సామాన్యంగా నేటి వ్యక్తులు ఆధునిక పదార్థాలన్నీ కేవలం ఆంగ్లేయులో, అమెరికనులో, లేక ఏ యిరోపి యన్‌లో కనిపెట్టేసినట్లు-వారికి బాహ్యంగానూ, ఆంత ర్యంలోనూ అనేకమైన కృతజ్ఞతాభివందనాలు సమర్పిం చెస్తూంటారు. ముఖ్యంగా భారతీయులు! ఇదెంతో సిగ్గు చేటు! ఈ కనిపెట్టబడిన ఆధునిక పదార్థాలన్నీ మన వేద పురాణాల్లో ఉన్నవే! ప్రస్తుతం స్తుతించబడుతూన్న ఈ అధునిక శాస్త్ర విజ్ఞానం, వేదపురాణకావ్యాల్లో ఉన్నదా లేదా అని. ఆయా గ్రంథాలు పరిశోధించేవారు ఒక్కరు కనబడరు!

ఇప్పుడీ ఆంగ్లాభిమాని ఐన తెనుగువ్యక్తిని చూడండి. అన్నీ విదేశీయులు కనిపెట్టినవే అంటున్నాడు భారతీయుడు అయికూడా! ఇలాంటి వాళ్లకి దవడపళ్లు రాలగొట్టేటట్టు జవాబు చెప్పేవాళ్లు ఎంతైనా అవసరం.

''అయ్యా! మీరేమైనా తెలుగు పుస్తకాలు చదివేరా?' ప్రశ్నించాను కోపం దిగమ్రింగుకుంటూ.

''డిటెక్టివ్ సా? ఓ కావలసినన్ని చదివాను.''

''ఛాఛా! డిటెక్టివులు గురించి కాదు నేనడిగింది!- రోడ్డుమీద శవం, రోడ్డుపక్క శవం, హోటల్లో శవం' పీపాలో శవం, ఇలాంటి శవాల్ని చదివితే మనం జీవచ్ఛ వాలమై పోతాము. నేనడిగింది తెలుగు కావ్యగ్రంథాల్ని గురించి అవి మీరు చదివి ఉంటే ఇలా కేవలం అంతా ఇంగ్లీషువారి మాహాత్మ్యమంటూ కూర్చుని ఉండక పోదురు,'' అన్నాను.

''ఇంతకీ ఏమిటందులో ఉన్న గ్రేట్‌నెస్?'' అన్నా డతను.

''కృష్ణదేవరాయల కాలంలో, అతని ఆస్థానకవి నంది

తిమ్మనగారు పారిజాతాపహరణ కావ్యంలో, పారిజాతం యొక్క గొప్ప విశేషాలను వర్ణిస్తూ ఆ పుష్పాన్నిగూర్చి ఇలా చెప్పారు; 'నెలకొని వేసవిఁ జలువయు, చలివేళల ఉష్ణగుణము సముచితభంగిఁ, కలిగించు ఈ లతాంతము, కొలదులు చెప్పంగ నిచ్చక్రొత్తలు సుమ్మీ!'- అంటే పారిజాతం వేసవిలో చల్లదనాన్నీ, చలివేళల్లో వేడిమిని సమానంగా ఇచ్చే పుష్పమన్నమాట. ఇది ప్రస్తుత సందర్భానికి మచ్చుతునక. ఇలాంటివి మనకింకా ఎన్నో, ఎన్నో కావ్యగ్రంథాల్లో లభిస్తాయి. అవి చదవకే మనం 'ఇంగ్లీషువారని, అమెరికను'లని వాచిపోతున్నాము.'' అని ఏకరువు పెట్టాను. మా సహప్రయాణీకులు కూడా ఒక చెవి మావైపే ఉంచారు, కొంత నిశ్శబ్దంగా కూడా ఉన్నారు. ఇందువలన నాకెంతో హుషారు కూడా పుట్టింది.

''అబ్బా! ఈ తెల్గు పోయెట్రీ అండర్‌స్టాండ్ కాదండీ! గొప్ప చిక్కు!'' కొంచెం చికాకు పడ్డాడతను.

''బోధపడని మాట నిజమే. కాని విద్యాధికులైన సారస్వతవేత్తలంటూ ఎందుకున్నారు చెప్పండీ! మన వంటి తెలియని వారికి తెలియ జెప్పడానికే! మహనీయుల్ని ఆశ్రయించాలి. వారి శుశ్రూష చేయాలి, తెలియనివి అడిగి తెలుసుకోవాలి. డబ్బుకేం? ఒక ధనాధికుణ్ణి మోసగించో, హత్యచేసో సంపాదించ వచ్చును! కాని విద్య అలా రాదు. పరిశ్రమచేయాలి. అంతేకాని మనకి బోధపడవంటూ ఇంటి దగ్గర కూర్చుంటే ఎలా చెప్పండీ! దొంగ వెళ్లి తనకుతానై పోలీసులకు దొరుకుతాడా? పోలీసే దొంగను పట్టాలి. మీ కిప్పుడు ఆంగ్లం జన్మతః వచ్చిలేదు కదా అనండి. మీ తండ్రిగారు ఉపాధ్యాయుల వద్దకు తీసికెళ్ళారు. మీరు నేర్చుకున్నారు. ఐతే ఆంగ్లం వచ్చినంత సులభంగా తెలుగురాదు. ఆంగ్లమంతా ఇరవైఆరు అక్షరాల్లోనూ, తెలుగు యాభైఆరు అక్షరాల్లోనూ ఉంది. అంటే రెట్టింపుకి పైగా అయినప్పుడు ఏ దెక్కువ కష్టం? ఏదెట్లానైనా మన మాతృభాషరాదని చెప్పుకోడం ఎంతో సిగ్గుచేటు! మిమ్మల్ని వేధిస్తున్నాననుకోకండి!'' బాగానే తగులుక్కున్నాను, ప్రత్యేకంగా తనొక్కడి మీదాపెడితే ఏడ్చుకుంటాడేమో అని 'మనం' అంటూనే మాట్లాడుతున్నాను.

అతనిహ మాట్లాడలేదు. హేండ్‌బేగ్‌లోని అమెరికన్ నవల ఒకటి తీసి మొహానికి అడ్డం పెట్టుకున్నాడు, చదవాలనే పెట్టుకున్నాడో, సిగ్గు చేతనే పెట్టుకున్నాడో నాకు తెలీదు. అట్టి ఉద్రేకాన్ని రెచ్చగొట్టే వెధవ ఇంగ్లీషు పుస్తకాలు చదవకుండా, ఎలాగైనా అతన్ని అటకాయించాలని బుద్ధిపుట్టింది చెప్పకేమి!

''ఇలాంటి పుస్తకాలు చదవడంవల్ల ప్రయోజన మేమిటండీ? వీటివల్ల విజ్ఞాన సముపార్జన జరగదు సరికదా ఉన్న కాస్త తెలివీకూడా తెల్లవారిపోతుంది!'' అన్నాను,

''జస్ట్ టు కిల్ ది టైమ్-అంటే కాలాన్ని చంపడానికి'' అన్నాడతను,

వెంటనే జెల్లకాయ కొట్టినట్లన్నాను ''మనంకాదు కాలాన్ని చంపడం, కాలమే మనల్ని చంపుతుంది! మన ఆయువు ఎన్నేళ్ళకాలమో, అన్నేళ్లకాలమూ పూర్తయే సరికి చచ్చేది మనమా, కాలమా? అందుకే కాలాన్ని సర్పంతో పోల్చారు. అది ఎప్పుడు, ఎక్కడ, ఎవర్ని కాటువేస్తుందో ఎవరికీ తెలియదు! ఎవరో ఆంగ్లేయులు 'కిల్ ది టైమ్'వంటి పదాలు వాడేస్తూండంవలన, వాళ్లు ఆ పదాన్ని అర్థవంతంగా వాడేరా అర్థరహితంగా వాడేరా అని ఆలోచించకుండా గ్రుడ్డిగా అనుకరించడంవలన, వాళ్ళకి మనం దాసులమై పోతున్నాము. ఇప్పటికైనా తెలుసుకోండి 'వీ కెనాట్ కిల్ ది టైమ్, బట్ టైమ్ విల్ కిల్ అజ్' అని నే ననేసరికి స్టేషన్‌వచ్చింది. రైలు ఆగింది,

''ఏయ్ కూలీ! ఈ సామాను ప్రక్క కంపార్టుమెంటులో పారేయ్! ఛస్తున్నాను! మైగాడ్!!'' అని రొద చేశాడతను!


# కథాంజలి

విడిప్రతి 25 న. పై.

సం॥ చందా 4-00.

(ప్రత్యేకసంచికలతో సహా)

అన్ని హిగిన్‌బాదమ్స్ స్టాలులోను దొరకును.